క్లుప్తంగా

ముస్లిం యూత్ కమిటీ సభ్యులకు అభినందన



మాదల(ముప్పాళ్ల): పోలీస్ అమర వీరుల సంస్మరణ కార్యక్రమంలో భాగంగా నరసరావుపేటలోని ఎస్పీ కార్యాలయంలో శనివారం జరిగిన రక్తదాన శిబిరంలో మాదల గ్రామానికి చెందిన ముస్లిం యూత్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. ఎస్కే సుబాని, ఎస్కే అబ్దుల్‌బకర్, ఎస్కే మహబూబ్ బాష, ఎస్కే వై.సుబాని, ఖాజావలి, నాగూల్, గౌస్, ఖాజాకరిముల్లా, మాబుసుబాని రక్తదానం చేశారు. కమిటీ సభ్యులను ఎస్పీ వై.రవిశంకర్‌రెడ్డి అభినందించారు.

అందుబాటులో ఓటర్ల ముసాయిదా జాబితా



ముప్పాళ్ల: మండలంలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో ఓటర్ల ముసాయిదా జాబితా అందుబాటులో ఉంచాలని, ఓటర్లు తమ ఓటు నిర్ధారణ కోసం తనిఖీ చేసుకోవచ్చని తహసీల్దార్ ఎం.భవానీశంకర్ చెప్పారు. స్థానిక తహసీల్దారు కార్యాలయంలో బీఎల్ఓలతో శనివారం సమావేశం నిర్వహించారు. వచ్చే నెల 4, 5, డిసెంబర్ 2, 3 తేదీలను ప్రత్యేక ప్రచార రోజులుగా ప్రకటించారని, ఆ రోజుల్లో బీఎల్ఓలు ఆయా పోలింగ్‌కేంద్రాల్లో అందుబాటులో ఉండాలన్నారు. 18 సంవత్సరాలు నిండిన లేదా నిండుతున్నట్లయితే ఈ నెల 27 నుంచి డిసెంబర్ 9వ తేదీ వరకు ఓటరుగా నమోదు చేసుకోవచ్చన్నారు. చనిపోయిన వారి ఓటు, డబుల్ ఓట్లను తొలగించాలన్నారు. సమావేశంలో డిప్యూటీ తహసీల్దారు సీహెచ్ లక్ష్మీప్రసాద్, ఆర్ఐలు కపిల్, పవన్‌కుమార్, ఆయా గ్రామాల బీఎల్వోలు పాల్గొన్నారు.

ఈ-క్రాప్ జాబితాపై అభ్యంతరాలు తెలపాలి



నకరికల్లు: ఈ-క్రాప్ నమోదు జాబితాపై అభ్యంతరాలు ఉంటే సత్వరమే రైతు భరోసా కేంద్రాల్లో రాత పూర్వకంగా తెలియజేయాలని మండల వ్యవసాయాధికారి కె.దేవదాసు అన్నారు. దేచవరం గ్రామంలో ఈ-క్రాప్ ముసాయిదా జాబితాపై శనివారం గ్రామ సభ నిర్వహించారు. రైతుల నుంచి వచ్చే అభ్యంతరాలు స్వీకరించి పరిష్కరించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వీఆర్వో పి.కోటేశ్వరరావు, కార్యదర్శి జి.వెంకటపతి, ఎంపీఓ కె.రవిబాబు రైతులు పాల్గొన్నారు.

బేస్‌బాల్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



క్రోసూరు: మేడికొండూరు మండలం మందపాడు జెడ్పీ ఉన్నత పాఠశాలలో శనివారం జరిగిన జిల్లా స్థాయి బేస్‌బాల్ పోటీల్లో ప్రతిభ కనబరిచి, క్రోసూరు సెయింటాన్స్ ఇంగ్లీషు మీడియం పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు ఆపాఠశాల ప్రిన్స్‌పల్ సిస్టర్ రజిత తెలిపారు. అండర్ 14 బాలికల విభాగంలో బి.చందన, బాలుర విభాగంలో వి.ఆదిత్య, అండర్-17 బాలుర విభాగంలో బి.చరణ్ ఎంపికైనట్లు చెప్పారు. ఈ సందర్భంగా ప్రిన్స్‌పల్ మాట్లాడుతూ పాఠశాలకు మంచి పేరు తేవాలని విద్యార్థులను, పాఠశాల పీఈటీ వెంకట్రావును కోరారు.

ఘనంగా పాఛవలిబాబా దర్గా ఉరుసు

యడ్లపాడు: మండలంలోని కొండవీడు గ్రామం కొండవీడు కొండపైన మెట్ల మార్గంలో వేంచేసి హజరత్ సయ్యద్ పీర్ పాఛవలి బాబా ఉరుసు మహోత్సవం ఘనంగా నిర్వహించారు. శుక్రవారం ఉదయం నుంచే సుదూర ప్రాంతాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో దర్గాను చేరుకుని బాబావారిని దర్శించుకున్నారు. ముజావర్లు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్నీ సౌకర్యాలను ఏర్పాటు చేశారు. రాత్రి 8 గంటలకు భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం బాబావారి గంధమహోత్సవం ప్రత్యేక అలంకరణలో ఉన్న అశ్వంపై ఊరేగింపు బయలుదేరింది. కోట, కొండవీడు గ్రామాల్లో పర్యటించి శనివారం తెల్లవారు జామున దర్గాకు చేరుకుంది. ముజావర్లు, కమిటీ సభ్యులు బాబావారికి దీపారాధన (ఫాతెహా) చేసి గంధం, ప్రసాదాన్ని భక్తులకు పంపిణీ చేశారు. ఆయా కార్యక్రమాలను కమిటీ సభ్యులు మద్దినగర్ షేక్ బాజీ, షేక్ ఖాజ(బాజీషహీద్ బ్యాటరీవర్క్స్), అలాం అమానుల్లా, అబ్దుల్ దావత్, అబ్బుతాలిబ్, బాష ఉరుసు కార్యక్రమ వివరాలను తెలిపారు.

కారణజన్ముడు వాల్మీకి మహర్షి

- రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు
- ఘనంగా వాల్మీకి మహర్షి జయంతి కార్యక్రమం



వాల్మీకి మహర్షి విగ్రహానికి పుష్పాంజలి ఘటిస్తున్న మంత్రి అంబటి రాంబాబు

సత్తెనపల్లి: రామాయణ గ్రంథకర్త వాల్మీకి మహర్షి కారణజన్ముడని రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. పట్టణంలోని 12వ వార్డు వాల్మీకి నగర్‌లో వాల్మీకి బోయ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ ఎద్దులదొడ్డి కోటేశ్వరమ్మ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన వాల్మీకి మహర్షి జయంతి కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. వాల్మీకి మహర్షి తన జీవిత కాలంలో పాప పుణ్య, కర్మలను ప్రక్షాళన చేశారని మంత్రి అన్నారు. ముందుగా వాల్మీకి మహర్షి విగ్రహానికి పుష్పాంజలి ఘటించారు. అనంతరం ఆయన అన్న సంతర్పణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు చల్లంచర్ల సాంబశివరావు, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పెండెం బాబూరావు, వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షుడు అచ్యుత శివప్రసాద్, ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి కోడిరెక్క దేవదాస్, రాజుపాలెం మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ మర్రి సుబ్బారెడ్డి, వల్లెం నరసింహారావు, వైఎస్ఆర్ సీపీ పట్టణ అధికార ప్రతినిధి ఎస్ఎం యూనస్, వాల్మీకి బోయ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎద్దులదొడ్డి శ్రీనివాసరావు ఉన్నారు.

బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో..

బీసీ సంఘ నాయకుడు పిక్కిలి రత్తయ్య ఆధ్వర్యంలో వాల్మీకి మహర్షి జయంతి వాల్మీకి నగర్‌లోని వాల్మీకి మహర్షి విగ్రహం వద్ద ఘనంగా నిర్వహించారు. పక్షి దుఃఖం చూసి జాలువారిన శ్లోకంతో బోయవారైన మహాకవి వాల్మీకిగా రూపు దాల్చి అద్భుతమైన రామాయణ మహా కావ్యాన్ని లిఖించి అందరి గుండెల్లో చిర స్థాయిగా నిలిచిపోయారన్నారు. వాల్మీకి మహర్షి విగ్రహానికి పుష్పాంజలి ఘటించారు. కార్యక్రమంలో బీసీ సంఘ నాయకులు పిక్కిలి శివ, కంటూ వెంకట రామయ్య, చింకా అంకమ్మరావు, మల్లా వెంకటేశ్వర్లు, ప్రత్తిపాటి హరికృష్ణ, పిక్కిలి రాజేష్, షేక్ చిన్న షరీఫ్, విప్పర్ల కొండలు, పిక్కిలి రత్తయ్య, దుగ్గినేని జగన్నాదం, పిల్లకతువుల నాగేశ్వరరావు, గొట్టం వెంకటేష్, గుంటూరు గోవిందు, పిక్కిలి విజయ్ తదితరులు పాల్గొన్నారు.

40 శాతం రాయితీపై శనగ విత్తనాల పంపిణీ



దేచవరంలో విత్తనాలు పంపిణీ చేస్తున్న కన్వీనర్ రాఘవరెడ్డి, ఏఓ దేవదాసు

నకరికల్లు: ప్రత్యామ్నాయ పంటల సాగుకు రైతులను ప్రోత్సహించేందుకు 40 శాతం రాయితీపై శనగ విత్తనాలను ప్రభుత్వం పంపిణీ చేస్తున్నట్లు వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ భవనం రాఘవరెడ్డి అన్నారు. మండలంలోని దేచవరం, రూపెనగుంట్ల, కుంకలగుంట, చేజర్ల, కండ్లకుంట, చాగల్లు, చల్లగుండ్ల, చీమలమర్రి, నకరికల్లు గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాల్లో శనివారం శనగ విత్తనాలు పంపిణీ చేశారు. దేచవరంలో మండల వ్యవసాయాధికారి కె.దేవదాసు మాట్లాడుతూ 450 క్వింటాళ్ల శనగ విత్తనాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. మార్కెట్ ధర కిలో రూ.81లు కాగా 40 శాతం రాయితీపై రూ.48.60లకే పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. వీఆర్వో పి.కోటేశ్వరరావు, గ్రామకార్యదర్శి జి.వెంకటపతి, ఎంపీఓ కె.రవిబాబు ఉన్నారు.

నేడు వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం

రాజుపాలెం: స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయ ఆవరణలో ఆదివారం వై ఏపీ నీడ్స్ జగన్ అనే కార్యక్రమం నిర్వహించనున్నట్లు వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ వేపూరి శ్రీనివాసరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్య అతిథిగా రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు హాజరు కానున్నట్లు పేర్కొన్నారు.

కానిస్టేబుళ్ల రక్తదానం

యడ్లపాడు: పోలీసులు అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా యడ్లపాడు పోలీస్‌స్టేషన్ సిబ్బంది ఐదుగురు రక్తదానం చేశారు. పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేటలో పోలీసులశాఖ ఆధ్వర్యంలో శనివారం ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో యడ్లపాడు పోలీస్‌స్టేషన్‌కు చెందిన సిబ్బంది మురళీకృష్ణ, వెంకటేశ్వర్లు, కిషోర్, నరేష్, ప్రవీణ్ పాల్గొని స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. ఈసందర్భంగా ఎస్‌ఐ పి సురేష్‌కుమార్ వారిని అభినందించారు.

పోటీ పరీక్షల్లో నారాయణ విద్యార్థి ప్రతిభ



సుదీవ్యను అభినందిస్తున్న ఏజీఎం లక్ష్మణ్‌రెడ్డి

సత్తెనపల్లి: అంతర్జాతీయ స్థాయిలో జరిగిన పోటీ పరీక్షల్లో పట్టణంలోని నారాయణ పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థిని కె.సుదీవ్య ఉత్తమ ఫలితం ఫలితాలు సాధించిందని ప్రిన్సిపల్ నరసింహారావు తెలిపారు. శనివారం పట్టణంలోని పాఠశాల ప్రాంగణంలో సుదీవ్యను ప్రత్యేకంగా అభినందించారు. ఇంటర్నేషనల్ స్టాండర్డ్స్ సైబర్ ఒలింపియాడ్ పరీక్షల్లో రాష్ట్ర స్థాయిలో ప్రథమ ర్యాంక్, జాతీయ స్థాయిలో తృతీయ ర్యాంక్, ఇంటర్నేషనల్ నాలెడ్జ్ ఒలింపియాడ్ పోటీ పరీక్షల్లో రాష్ట్ర స్థాయిలో ద్వితీయ ర్యాంక్, జాతీయ స్థాయిలో 8వ ర్యాంకు సుదీవ్య కైవసం చేసుకుందన్నారు. ఈ సందర్భంగా సుదీవ్యను ఏజీఎం లక్ష్మణ్‌రెడ్డి, ఆర్ఐ హస్సేమయ్య, ఏసీఓ భద్రారెడ్డి, అకాడమిక్ డీన్ నాగేశ్వరరావు, వైస్ ప్రిన్సిపల్ సోమయ్య ఉపాధ్యాయులు అభినందించారు.

ఇరువురికి ఏడాది జైలు శిక్ష

చిలకలూరిపేటటౌన్: వ్యక్తిపై దాడి చేసి గాయపరిచిన ఘటనకు సంబంధించి ఇద్దరు వ్యక్తులకు ఒక సంవత్సరం జైలు శిక్ష విధిస్తూ ప్రిన్సిపల్ జూనియర్ జడ్జి కె.నరేంద్రరెడ్డి శుక్రవారం తీర్పునిచ్చారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని పాటిమీదకు చెందిన అందుగుల శ్రీకాంత్ ను పట్టణంలోని వడ్డెర పాలేనికి చెందిన దార్ల శ్రీకాంత్, కోడిరెక్క శేషయ్యలు గత సంవత్సరం డిసెంబర్ నెలలో సెల్ ఫోన్ వివాదం కారణంగా దాడి చేశారు.ఈ విషయంపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ నేపథ్యంలో నేరం రుజువు కావడంతో ఇరువురికి న్యాయమూర్తి శిక్ష విధించారు.

నూర్ బాషాలకు చట్టసభల్లో ప్రాతినిధ్యమే లక్ష్యం

క్రోసూరు: నూర్ బాషాలకు చట్ట సభల్లో ప్రాతినిధ్యం, బడ్జెట్ కేటాయింపు డిమాండ్లు సాధించుకునేందుకు నూర్ బాషాల సింహగర్జన సభ నిర్వహించనున్నట్లు మండల నూర్ బాషాల సంఘం అధ్యక్ష కార్యదర్శులు షేక్ మస్తాన్, షేక్ జాన్‌బాషా శనివారం తెలిపారు. గుంటూరులోని ఆంధ్ర ముస్లిం కళాశాల ఆవరణలో ఆదివారం మధ్యాహ్నం జరగనున్న నూర్ బాషా(దూదేకుల) ముస్లిం సింహ గర్జనకు భారీగా తరలి రావాలని వారు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఆవులవారిపాలెం, బయ్యవరం, అచ్చంపేట మండలంలోని అచ్చంపేట, తాళ్లచెరువు, పెదపాలెం, కోనూరు గ్రామాల నుంచి నూర్‌బాషా సోదరులు అధికంగా సభకు వచ్చేందుకు వాహనాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. క్రోసూరులో భోజన ఏర్పాట్లు చేసినట్లు వివరించారు. జనాభా దామాషా ప్రకారం రాజకీయ పార్టీలు దూదేకుల వారికి చట్టసభల్లో తగిన ప్రాతినిధ్యం కల్పించాలని, మైనార్టీ పదవులలో వర్గీకరణ దామాషా ప్రకారం దూదేకుల పదవులు , బడ్జెట్ తప్పనిసరిగా కేటాయించాలని సభలో డిమాండ్ చేయనున్నట్లు తెలిపారు. అదేవిధంగా ఏ రాజకీయ పార్టీ అయితే నూర్‌బాషా (దూదేకుల) ముస్లిం కులస్తులకు చట్ట సభలలో అవకాశం కల్పిస్తుందో ఆ పార్టీకి తమ సంపూర్ణ మద్దతు ఇవ్వడం జరుగుతుందని ప్రకటించడం ఈ సభ ముఖ్య లక్ష్యమని అన్నారు.

నేటి నుంచి ఉచిత వైద్య శిబిరం

నరసరావుపేట: సోరియాసిస్‌డే సందర్భంగా గుంటూరురోడ్డులోని కేరళ ఆయుర్వేద హాస్పిటల్‌లో ఆదివారం నుంచి మూడురోజులపాటు నిర్వహించే ఉచిత వైద్యశిబిరాన్ని జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ లక్కిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి శనివారం కోరారు. ప్రతి విషయాన్ని డాక్టర్‌తో సంప్రదించి చర్చించి తమ సందేహాలు నివృత్తి చేసుకోవాలన్నారు.

గణపవరంలో దోమల నివారణకు చర్యలు

నాదెండ్ల: మేజర్ పంచాయతీ గణపవరం గ్రామంలో గత కొద్దిరోజులుగా దోమల బెడద కారణంగా వైరల్ జ్వరాలు ప్రబలుతున్న నేపథ్యంలో పంచాయతీ అధికారులు చర్యలు చేపట్టారు. దోమల నివారణకు గ్రామంలో మలాథియన్ పిచికారీ చేస్తున్నారు. గ్రామంలోని వీధులను బ్లీచింగ్‌తో శుభ్రం చేసి కాలువల్లో ఫాగింగ్ చేశారు. పారిశుధ్యాన్ని మెరుగ్గా నిర్వహించి దోమల ఉధృతి తగ్గించేందుకు పనులు చేపట్టామని, మరికొన్నిరోజుల పాటూ పనులు కొనసాగుతాయని పంచాయతీ కార్యదర్శి అరవపల్లి శేఖర్ తెలిపారు.

ఓటర్ జాబితాను తనిఖీ చేయాలి



మాట్లాడుతున్న తహసీల్దార్ జి.సుజాత

చిలకలూరిపేటటౌన్: ఓటరు నమోదులో మార్పులు, చేర్పులు, తొలగింపులు సంబంధించిన దరఖాస్తులను పరిశీలించి ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని చిలకలూరిపేట మండల తహసీల్దార్ జి.సుజాత చెప్పారు. శనివారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో నియోజకవర్గ పరిధిలోని బూత్ లెవల్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ నెల 27వ తేదీన ఓటర్ల ముసాయిదా జాబితా ప్రచురణ జరిగిందని, ఇందుకు సంబంధించి బూత్‌స్థాయి అధికారులు ఓటర్ జాబితాను తనిఖీ చేయాలని సూచించారు. ఏమైనా ఇంటి నంబర్ సున్నా ఉంటే వాటిని గుర్తించి సవరించటానికి ఫాం-8 దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. ఒకే ఇంటి నంబర్‌తో 10 అంతకంటే ఎక్కువ ఓటర్లు ఉంటే ఫాం-8 లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. తొలగింపులు, మార్పులకు సంబంధించిన దరఖాస్తులు డిసెంబర్ 26 తేదీ లోపు విచారణ చేసి ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. జనవరి 5, 2024 న ఓటర్ల తుది జాబితా ప్రచురించటం జరుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సీహెచ్ గోవిందరావు, డిప్యూటీ తహసీల్దార్ ఎన్.రవికుమార్ పాల్గొన్నారు.

దాడిచేసిన వారిపై చర్యలు తీసుకోండి

నరసరావుపేట: కావలి ఆర్టీసీ బస్సు డ్రైవరు రామసింగ్, కండక్టర్ పై దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఏపీ బొందిలి సంఘ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బొందిలి శ్రీనివాససింగ్ శనివారం ఒక ప్రకటనలో కోరారు. ఈ నెల 26వ తేదీన కొంతమంది గుర్తు తెలియని వ్యక్తులు వారిపై దాడి చేయడం జరిగిందన్నారు. ఇది చాలా విచారించదగ్గ విషయమన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా నిందితులపై ప్రభుత్వం గట్టి చర్యలు తీసుకోవాలన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బీసీలకి ఎంతగానో ప్రాధాన్యత ఇస్తున్నారని, తక్షణమే నిందితులను అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని కోరారు.

లీగల్ మెట్రాలజీ అధికారుల దాడులు

- ఆరుగురిపై కేసులు నమోదు
- అపరాధ రుసుం వసూలు



ఓ ఎరువుల దుకాణంలో తనిఖీలు నిర్వహిస్తున్న అధికారులు షాలేమ్‌రాజు, శివశంకర్

నాదెండ్ల: మండలంలోని పలు వ్యాపార దుకాణాల్లో లీగల్ మెట్రాలజీ అధికారులు విస్తృత తనిఖీలు నిర్వహించారు. నాదెండ్ల, గణపవరంతో పాటూ మరికొన్ని గ్రామాల్లోని పురుగు మందు, ఎరువుల దుకాణాలు, కిరాణా దుకాణాల్లో తనిఖీలు నిర్వహించారు.

ఎరువుల దుకాణాల్లో అధిక ధరలకు ఎరువులు విక్రయిస్తున్నట్లు గుర్తించి ముగ్గురు దుకాణదారులపై కేసులు నమోదు చేశారు. ఒక కిరాణా దుకాణంలో కాటాలో వ్యత్యాసాలున్నట్లు గుర్తించారు. మరో ఎలక్ట్రికల్ దుకాణంలో వస్తువులపై డిక్లరేషన్ లేదని కేసు నమోదు చేశారు. గుంటూరు డిప్యూటీ కంట్రోలర్ లీగల్ మెట్రాలజీ అధికారి టి షాలేమ్‌రాజు, నరసరావుపేట లీగల్ మెట్రాలజీ ఇన్‌స్పెక్టర్ శివశంకర్ తనిఖీల్లో పాల్గొన్నారు. కేసులు నమోదుతో పాటూ అపరాధ రుసుము వసూలు చేశారు. సాధారణ కాటా లున్న వారు ప్రతి ఏడాది కాటాలను రెన్యువల్ చేయించుకోవాలని, ఎల్రక్టానిక్ కాటాలున్న యజమానులు రెండేళ్ళకోసారి రెన్యువల్ చేయించుకోవాలన్నారు. నిత్యావసరాలు, ఎరువులు, పురుగుమందులను అధిక ధరలకు విక్రయిస్తే క్రిమినల్ కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు.

జాబితాను రైతులు సరిచూసుకోవాలి



వినుకొండ(నూజెండ్ల) : మండలంలోని అన్ని ఆర్బీకేలలో సామాజిక తనిఖీ కోసం ఈ-క్రాప్ ముసాయిదా జాబితాను ప్రదర్శించడం జరుగుతుందని ఏవో షేక్ సుగుణాబేగం తెలిపారు. మండల కేంద్రమైన నూజెండ్లలోని ఆర్బీకే కేంద్రంలో ఈ-క్రాప్ ముసాయిదా జాబితాను ఆమె నోటీస్ బోర్డులో అందుబాటులో ఉంచారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆయా గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించి ముసాయిదా జాబితాలోని రైతుల వివరాలను ఆర్బీకే సిబ్బంది చదివి వినిపిస్తారన్నారు. రైతులు ముసాయిదా జాబితాను పరిశీలించి అభ్యంతరాలు ఏమైనా ఉంటే సవరణ కోసం ఆర్బీకే కేంద్రాల్లోని వీఏఏ, వీహెచ్ఏ, వీఎస్ఏలను సంప్రదించి అభ్యంతరాలను రాతపూర్వకంగా తెలియ జేయాలన్నారు. ఖరీఫ్ సీజన్‌కు ఇదే ఆఖరి అవకాశమని, తుది జాబితా ప్రదర్శన తరువాత ఎటువంటి మార్పులు, చేర్పులు ఉండవని పేర్కొన్నారు. రైతులు కార్యక్రమంలో ఏఈవో ఎల్. ఎలీషా, వీఏఏ జి.మానిక తదితరులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

ఎమ్మెల్యే నంబూరు శంకరరావు



గాదెవారిపాలెం సర్పంచ్ అన్నపూర్ణ ప్రమాణస్వీకారంలో ఎమ్మెల్యే

గాదెవారిపాలెం(క్రోసూరు): రైతు సంక్షేమమే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం పనిచేస్తోందని ఎమ్మెల్యే నంబూరు శంకరరావు అన్నారు. గాదెవారిపాలెం గ్రామంలో రూ.21.80 లక్షల నిధులతో నిర్మించిన రైతు భరోసా కేంద్రం భవనం, రూ.5 లక్షల నిధులతో నిర్మించిన సీసీ రోడ్డును శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతు బాగుంటేనే రాష్ట్రం బాగుంటుందని, ప్రతి గ్రామంలో రైతుల అవసరాలను తీర్చేందుకు రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈవోపీఆర్డీ పి.శివరామయ్య, వైఎస్సార్‌సీపీ నాయకులు దేశిరెడ్డి సత్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.

సర్పంచ్ అన్నపూర్ణ ప్రమాణ స్వీకారం

గాదెవారిపాలెం గ్రామ సర్పంచ్‌గా దండెబోయిన అన్నపూర్ణ ప్రమాణస్వీకార కార్యక్రమంలో ఎమ్మెల్యే నంబూరు శంకరరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాభివృద్ధికి తన సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయన్నారు. గ్రామంలో వినాయకుడి ఆలయం అభివృద్ధికి రూ.10 లక్షల నిధులు ప్రకటించారు.

అందరికీ ఉపాధి, ఉద్యోగం ప్రభుత్వ లక్ష్యం

అందరికీ ఉపాధి, ఉద్యోగం అదే తమ ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే నంబూరు శంకరరావు అన్నారు. క్రోసూరు జెడ్పీ పాఠశాలలో ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ అండ్ ట్రైనింగ్ ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా జాబ్ మేళాను ఆయన ప్రారంభించారు. గ్రీన్ టెక్ ఇండస్ట్రీస్, హెటిరో డ్రగ్స్, స్కిల్ క్రాఫ్ట్, మదర్సన్ సుమీ ఇండియా ప్రైవేటు లిమిటెడ్, యెకోహామా, జయలక్ష్మి ఆటోమేటివ్స్ వంటి కంపెనీలు మెగా జాబ్ మేళాలో పాల్గొంటున్నాయన్నారు. నిరుద్యోగ యువత కోసం స్కిల్ డెవలప్‌మెంట్ ద్వారా క్రోసూరు పాలిటెక్నిక్ కళాశాలలో అనేక కోర్సులు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి గుంటూరు జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారి పద్మావతి, డీఎస్‌డీవో కె.సంజీవరావు, యార్డు చైర్మన్ ఈదా సాంబిరెడ్డి, ఎంపీపీ పి.కోటయ్య, జెడ్పీటీసీ జమీలా గఫూర్, మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వెలది అప్పారావు, ఏఎంసీ వైస్ చైర్మన్ గార్ల పాటిదాసు, అనుముల కోటిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. జాబ్ మేళాలలో ఎంపికైన అభ్యర్థులకు ఆఫర్ లెటర్లను ఎమ్మెల్యే నంబూరు శంకరరావు అందజేసారు. 255 మంది అభ్యర్థులు ఇంటర్వ్యూలకు హాజరుకాగా 75 మంది ఉద్యోగాలు సాధించారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేత

క్రోసూరు వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే నంబూరు శంకరరావు 12 మంది బాధితులకు రూ.12.40 లక్షల సీఎంఆర్ఎఫ్ నగదు చెక్కులు అందజేశారు. అమరావతి మండలం పొందుగలకు చెందిన తాడేపల్లిసామ్రాజ్యంకు రూ.1.20 లక్షలు, కర్లపూడికి చెందిన బొంతాత్రివేణి రూ.20 వేలు, పెదకూరపాడు మండలం జలాలపురం గ్రామానికి చెందిన రుద్రకాంతమ్మ రూ.1.20లక్షలు, నూతలపాటి అరుణ రూ.1.20 లక్షలు,కంభంపాడుకు చెందిన నెట్టం రంగమ్మ రూ.1.20లక్షలు, పెదకూరపాడుకు చెందిన చంద్ర నాగేంద్రం రూ.60వేలు, క్రోసూరు మండలంలోని ఎర్రబాలెం గ్రామానికి చెందిన ఏకుల భాగ్యమ్మ రూ.1లక్ష, క్రోసూరుకు చెందిన కొడవటి రాణీ రూ.1.40 వేలు, అచ్చంపేట మండలం తాళ్లచెరువుకు చెందిన ఎరువ రాజమ్మ రూ.60 వేలు, వేల్పూరుకు చెందిన మాగులూరి అర్జున్‌రూ.60 వేలు, బెల్లంకొండ మండలం కందిపాడుకు చెందిన మర్రి సత్యనారాయణరెడ్డి రూ.1.20 వేలు సంబంధించిన చెక్కులను అందచేసారు.

వైఎస్సార్ సీపీలో గిరిజన కుటుంబాల చేరిక



పార్టీలో చేరిన గిరిజన కుటుంబాలతో ఎమ్మెల్యే నంబూరు

అచ్చంపేట:అర్హతే ప్రామాణికంగా ఎవరి ప్రమేయం లేకుండా నేరుగా బ్యాంకు ఖాతాలలో జమ అవుతున్న సంక్షేమ పథకాల లబ్ధిపై ఆకర్షితులవుతున్న అనేక కుటుంబాల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నాయని ఎమ్మెల్యే నంబూరు శంకరరావు అన్నారు. మండలంలోని తాడువాయి పంచాయతీ పరిధిలోని సంద్ర తండాకు చెందిన 12 గిరిజన కుటుంబాలు తెలుగుదేశం పార్టీని వీడి.. శనివారం క్రోసూరులోని పార్టీ కార్యాలయంలో వైఎస్సార్ సీపీలో చేరాయి. హామీలను నెరవేర్చే వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ వైపు జనం అంతా చూస్తున్నారని ఎమ్మెల్యే అన్నారు. మాజీ సర్పంచ్ అనుముల వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో సంద్ర తండాకు చెందిన భూక్యా నరసింహా నాయక్, కోటేశ్వరరావు నాయక్, బాణావతు శ్రీను నాయక్, బాణావతు నరసింహా నాయక్, కొండా నాయక్, తులసి నాయక్, బాలయ్య నాయక్, జామ్లా నాయక్, కృష్ణా నాయక్, మురళి నాయక్ తదితర కుటుంబాలు వైఎస్సార్ సీపీలో చేరాయి. రాబోయే ఎన్నికలలో తమకు మేలుచేసే ఎమ్మెల్యేగా నంబూరు శంకరరావును, సీఎంగా వైఎస్ జగన్‌మోహనరెడ్డిని మళ్లీ గెలిపించుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ భూక్యా రజనీ కృష్ణా నాయక్, మాజీ సర్పంచ్ అనుముల వెంకటేశ్వరరావు, గ్రామ పార్టీ కన్వీనర్ వేమవరపు విజయ్‌కుమార్, భూక్యా జానూ నాయక్ తదితరులున్నారు.

సంక్షేమ పథకాలు సక్రమంగా అమలుజేయాలి

ఎంపీపీ గడ్డం బాలనాగమ్మ



మాట్లాడుతున్న ఎంపీపీ బాలనాగమ్మ

రొంపిచర్ల : మండలంలో ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులైన వారందరికీ అందజేయాలని ఎంపీపీ గడ్డం బాలనాగమ్మ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో శనివారం నిర్వహించిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ఈ సమావేశానికి ఎండిఓ కె.మ్యాథ్యూబాబు అధ్యక్షత వహించారు. సమావేశంలో పాల్గొన్న ఎంపీపీ గడ్డం బాలనాగమ్మ మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంగా పనిచేసి అభివృద్ధి పనులు వేగవంతం చేయాలన్నారు. గ్రామ వలంటీర్ల, అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంగా పనిచేయాలన్నారు. ఎండిఓ కె. మ్యాథ్యూబాబు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. అందరూ ఆరోగ్యంగా ఉండాలనే ఉద్దేశ్యంతో ప్రవేశ పెట్టిన ఈ పథకం క్రింద గ్రామాలలో సురక్ష వైద్యశిబిరములు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో వివిధ శాఖల అధికారులు తమ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులు గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ జి.అంకారావు, ఆర్‌ఐ కె. సుబ్బారావు, పంచాయతీ రాజ్ ఎఈ జగన్మోహన్ రెడ్డి, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామ కార్యదర్శులు, గ్రామసచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఉచిత మెగా వైద్యశిబిరం



వినుకొండ(నూజెండ్ల) : రోటరీ క్లబ్ గ్రేటర్ వినుకొండ ఆధ్వర్యంలో కాటూరి మెడికల్ కాలేజీ అండ్ హాస్పటల్ వారిచే శనివారం పట్టణంలోని గోగినేని కల్యాణమండపం నందు ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహించారు. ఈ వైద్యశిబిరంలో షుగర్, హిమోగ్లోబిన్, కొలెస్ట్రాల్, మూత్రపిండాలు, లివర్, గుండె పరీక్షలకు సంబంధించి 600మందికి పైగా వైద్యసేవలు అందించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. 20మంది రక్తదానం చేసినట్లు తెలిపారు. ఈ క్యాంప్‌కు సహకరించిన దాతలను, కాటూరు వైద్యబృందాన్ని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకయ్య, డాక్టర్ సాంబశివరావు, క్లబ్ సభ్యులు సీహెచ్. కోటేశ్వరరావు, జి.గురునాథం, షేక్ రసూల్, ఆలా శ్రీనివాసరావు, బాజీ, శ్రీనివాసరావు, గిరిబాబు, శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.